సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 21 । జూన్ । 2024





**అస్తవ్యస్తంగా విద్యుత్‌శాఖ**

జిల్లా విద్యుత్‌శాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు.

- 8లో ▸



**దరఖాస్తులను పరిష్కరించాలి**

ధరణి పెండింగ్ దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.2 /25.4

**వాతావరణం**

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

**న్యూస్‌రీల్**

### ఆర్వోబీ పనులు వేగంగా పూర్తి చేయాలి



నిజామాబాద్‌రూరల్ : మండలంలోని మాధవనగర్ ఆర్వోబీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హన్మంతు సూచించారు. గురువారం ఆయన పనులను పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలన్నారు. డిప్యూటీ ఇంజినీర్ ప్రవీణ్, కార్పొరేటర్ ప్రమోద్, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

### అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ



నిజామాబాద్‌నాగారం : అంగన్‌వాడీలో ప్రీ ప్రైమరీ బోధనపై టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని సుభాష్‌నగర్‌లో గురువారం నిర్వహించారు. డీడబ్ల్యూవో రసూల్‌బీ మాట్లాడుతూ.. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు పూర్వ ప్రాథమిక సంరక్షణ, విద్యను అందించడానికి అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. పిల్లలకు ఆటపాటలతో పాటు ఆంగ్లం కూడా నేర్పించాలన్నారు. మొదటి బ్యాచ్‌లో 36 మందికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన మేయర్ నీతూకిరణ్ మాట్లాడుతూ.. పిల్లలను చిన్నప్పటి నుంచే మంచి ఆలోచనలతో తీర్చిదిద్దాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోని అంగన్‌వాడీలను బలోపేతం చేయాలన్నారు. స్నేహ సొసైటీ ఆర్గనైజర్ సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

### 27 వరకు బీఈడీ రీవాల్యుయేషన్‌కు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ కోసం ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సంబంధిత కళాశాలల్లో దరఖాస్తులను పొందవచ్చన్నారు. రీవాల్యుయేషన్ ఫీజు రూ.500 (ఒక్కో పేపర్‌కు), రీకౌంటింగ్‌కు రూ.300 (ఒక్కో పేపర్‌కు), దరఖాస్తు ఫారానికి రూ. 25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుతో పాటు మెమో జిరాక్స్ జతచేయాలన్నారు. బీఈడీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థుల నుంచి రీవాల్యుయేషన్, రీకౌంటింగ్ ఫీజు వసూలు చేసి యూనివర్సిటీ అకౌంట్‌కు ఈ నెల 28 లోపు చెల్లించడంతో పాటు ఈ నెల 29 సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తు ఫారాలు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఆన్‌లైన్ మెమో, నిర్ణీత రుసుము లేకుండా దరఖాస్తు ఫారాలు అంగీకరించమని స్పష్టం చేశారు. వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

# వెలవెలబోతున్న శ్రీరాంసాగర్

నీరు లేక బోసిపోతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్



- ప్రస్తుతం 8 టీఎంసీలకు పడిపోయిన నీటి నిల్వ
- గతేడాది ఈ సమయానికి 15 టీఎంసీల నీరు
- ఎడారిని తలపిస్తున్న బ్యాక్‌వాటర్ ఏరియా
- వర్షాభావంతో ఎగువన మహారాష్ట్రలోని ప్రాజెక్ట్‌లు సైతం ఖాళీ



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయం నీరు లేక వెలవెలబోతోంది. ప్రస్తుతం జలాశయంలో కేవలం 8 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ఇందులో 5 టీఎంసీలు డెడ్ స్టోరేజ్ కింద తీసేస్తే, తాగునీటి అవసరాలకు సైతం సరిపడిన నీరు లేకుండా పోయింది. తాగు నీటి అవసరాల కోసం ఏడాదికి 5 టీఎంసీల నీరు నిల్వ ఉంచాలి. నీటి ఆవిరి లెక్కలతో కలుపుకుంటే జలాశయంలో కనీసం 15 టీఎంసీల నీరు నిల్వ ఉండాలి. కానీ ప్రస్తుతం కేవలం 8 టీఎంసీలే ఉంది. గత ఏడాది ఈ సమయానికి జలాశయంలో 15 టీఎంసీల నీరు ఉంది. కాగా నీటిమట్టం భారీగా తగ్గిన విషయానికి వస్తే 2015 జూన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రాజెక్టు చరిత్రలోనే అతి తక్కువగా 4 టీఎంసీల కనిష్టానికి నీటిమట్టం పడిపోయింది. ఇక 2019 జూన్‌లో సైతం నీటిమట్టం 6 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుతం ఎగువన ఉన్న మహారాష్ట్రలో వర్షాభావం కారణంగా వరద రావడం లేదు. నామమాత్రంగా 1,757 క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రస్తుతం వచ్చింది. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియా ఎడారిని తలపిస్తోంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో గత ఏడాది పరిస్థితి కొంతమేర బాగానే ఉంది. అవసరాలకు సరిపడేవిధంగా 15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. అయితే ప్రస్తుత సంవత్సరం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం నివేదికలో అధికారులు మార్పులు చేశారు. ఈ మార్పుల మేరకు గత ఏడాది నీటి నిల్వ 15 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ పాత నీటి నిల్వ సామర్థ్యం ప్రకారం ప్రాజెక్ట్‌లో గత ఏడాది 20 టీఎంసీల నీరు నిల్వ చూపారు. గత ఏడాది వరకు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలుగా చూపిన అధికారులు, ఇప్పుడు 80 టీఎంసీలుగా మార్పు చేశారు. గత ఏడాది జూన్ చివరి వారంలో ఎగువ నుంచి వరదలు ప్రారంభమై జూలై 25 నాటికి ప్రాజెక్ట్‌లోకి 70 టీఎంసీల నీరు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదలు అంచనా వేసిన అధికారులు వరద గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదిలారు. కాగా ప్రస్తుత సంవత్సరం ఆ పరిస్థితి కనిపించడం లేదు.

#### ఎగువ ప్రాజెక్టులలో 10 శాతమే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువన ఉన్న మహారాష్ట్రలోని ప్రాజెక్ట్‌ల ద్వారానే నీరు రావాల్సి ఉంది. ఆ రాష్ట్రంలోని విష్ణుపురి, గైక్వాడ్ ప్రాజెక్టులు, బాబ్లీ బ్యారేజ్‌లలో ప్రస్తుతం 10 శాతం నీటి నిల్వ కూడా లేదు. పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో ఎగువన ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చే వరదలపై ఆశలు లేకుండా పోయాయి. మహారాష్ట్రలో వర్షాలు కురిస్తేనే సాగర్‌కు నీరు వస్తుంది.

#### పునరుజ్జీవంపై ఆశలు లేనట్లే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సకాలంలో వరదలు రాకపోతే కాళేశ్వరం నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా ఎస్సారెస్పీ జలాశయంలోకి నీటిని తరలించేందుకు గాను, ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం నిర్మించారు. గత ఏడాది 2.5 టీఎంసీల నీటిని మాత్రం కాళేశ్వరం నుంచి ఎత్తిపోశారు. అయితే ప్రస్తుతం కాళేశ్వరం పిల్లర్లు కుంగిపోవడం, అక్కడా నీరు లేదు. పైగా విచారణ నడుస్తోంది. ఈ నేపథ్యంలో పునరుజ్జీవన పథకంపైనా ఆశలు లేకుండా పోయాయి. ప్రస్తుతం ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆధారంగా వానాకాలం, యాసంగి సీజన్లలో 18 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోంది.

## పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్ : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ నెల 24 నుంచి 29 వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్ష, ఈ నెల 30 నుంచి జూలై 04 వరకు డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అలాగే ఈనెల 23న నిర్వహించనున్న నీట్ పీజీ ఎగ్జామ్ ఏర్పాట్లపై సమీక్ష జరుపుతూ, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో కొనసాగుతాయన్నారు. నీట్ పీజీ ఎగ్జామ్ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. పరీక్షలు సాఫీగా కొనసాగేలా సంబంధిత అధికారులతోపాటు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. బయోమెట్రిక్ విధానం అమలులో ఉన్నందున అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, కలెక్టరేట్ పరీక్షల విభాగం పర్యవేక్షకుడు పవన్, ఆర్టీసీ, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పాముల సయ్యాట..



వర్షాలు పడటంతోనే పాములు పొదల్లో నుంచి బయటకు వస్తున్నాయి. ఇలా సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలోని ఎల్లమ్మ మర్రి ప్రాంతంలో గురువారం కనిపించిన జతకట్టిన పాములు సయ్యాటలాడుతూ అలరించాయి. అటు వైపు పొలాలకు వెళ్తున్న రైతులు వాటిని సెల్‌ఫోన్లలో బంధించారు. – సిరికొండ

## రెవెన్యూ డివిజన్ల అప్‌గ్రేడ్

- ఆర్మూర్, బోధన్, బాన్సువాడలకు సబ్ కలెక్టర్లు

సాక్షి, కామారెడ్డి : ఉమ్మడి జిల్లాలోని బోధన్, ఆర్మూర్, బాన్సువాడ రెవెన్యూ డివిజన్ల స్థాయి పెరిగింది. వీటికి త్వరలో ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ అధికారి డివిజన్ అధికారిగా రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయా రెవెన్యూ డివిజన్లకు అధికారిగా ఆర్డీవో ఉన్నారు. అయితే రెవెన్యూ పాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలోని పలు రెవెన్యూ డివిజన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ఐఏఎస్ అధికారులను సబ్ కలెక్టర్లుగా నియమించాలని నిర్ణయించింది. ఆయా రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవో పోస్టులను సబ్ కలెక్టర్ పోస్టుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## ఓటమిని జీర్ణించుకోలేకే ఆరోపణలు

- ఎంపీ ధర్మపురి అర్వింద్



సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని జీర్ణించుకోలేని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వారిరువురు తనపై చేసిన ఆరోపణలపై ఎంపీ అర్వింద్ గురువారం హైదరాబాద్ నుంచి వీడియో సందేశాన్ని విడుదల చేశారు. బీజేపీ ప్రలోభాలతో గెలిచిందని, ఓటర్లకు డబ్బులు పంచారని, మోదీ ప్రభావం కలిసొచ్చిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొనడం సరికాదన్నారు. తాను మోదీ ప్రభావంతోనే రాజకీయాల్లోకి వచ్చానని గుర్తుచేశారు. ఆర్మూర్, బాల్కొండ, ఇతర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నాయకులు రూ.200 నోట్లు పట్టుకుని రోడ్లపై ఎందుకు తిరిగారని ప్రశ్నించారు. జగిత్యాల ప్రజలపై జీవన్‌రెడ్డికి ప్రేమ లేదని, ముస్లింల కోసమే ఆయన పని చేస్తున్నారని విమర్శించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా గౌరవాన్ని కాపాడుకోవాలని హితవుపలికారు. అమ్మ ఆదర్శ పాఠశాల మూత్రశాలల్లో టైల్స్ వేయొద్దని అధికారులను సుదర్శన్‌రెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్‌తో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా మూత్రశాలల్లో టైల్స్ వేయాలని ఆదేశించాలని కోరానన్నారు.

## ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కు

- పార్టీలో కష్టపడిన వారికే పదవులు
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చిత్రంలో షబ్బీర్ అలీ, భూపతిరెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, మోహన్‌రెడ్డి

ఖలీల్‌వాడి : పార్లమెంట్ ఎన్నికలలో నిజామాబాద్‌లో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కై కాంగ్రెస్‌ను ఓడించాయని ఆ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. జిల్లాలో ఈఎస్ఐ ఆస్పత్రిని మూసివేసిన ఎంపీ అర్వింద్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పదేళ్లుగా కాంగ్రెస్‌లో పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకున్నామని, వారికి లోకల్ బాడీ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులలో అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో మోదీ చరిష్మా తగ్గిందని, దానికి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ అర్వింద్ ఎన్నికల సమయంలో మోదీ, అయోధ్య రామమందిరం పేరు చెప్పి ఓట్లు అడిగారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తల కృషి ఎనలేనిదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మోదీ ప్రభావం, బీఆర్ఎస్, బీజేపీ ఒకటి కావడంతో కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. ఎన్నికలలో తాను ఓడిన జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందూర్‌ను స్మార్ట్ సిటీగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా నివేదిక అందిస్తామన్నారు.

**అభివృద్ధిపై సమీక్షిస్తే బీజేపీకి ఏమి ఇబ్బంది**

జిల్లా అభివృద్ధిపై తాను అధికారులతో సమీక్షలు పెడితే బీజేపీకి వచ్చే ఇబ్బందులు ఏమిటని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రశ్నించారు. రాజకీయాలు మాని అన్ని పార్టీలు కేంద్రం, రాష్ట్రం నుంచి నిధులు తీసుకువచ్చి జిల్లాను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమీక్షలపై బీజేపీ మాట్లాడం సరి కాదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశ వేణు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, నాయకులు గడుగు గంగాధర్, వినయ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సునీల్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, బాడ్సి శేఖర్, కవితా రెడ్డి, యాదగిరి, రాజనరేందర్‌గౌడ్, వైశాఖి సంతోష్, వీక్కీయాదవ్, గోర్త రాజేందర్, అరుణ్, వేణు రాజ్ పాల్గొన్నారు.

# ఆరోగ్య యోగం

- యోగాతో ఆరోగ్య, మానసిక సమస్యలకు పరిష్కారం
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ



యోగా చేస్తున్న మోపాల్‌కు చెందిన నవీన్‌రెడ్డి, అక్షర

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నేటి పోటీ ప్రపంచంలో మనిషికి తీరిక ఉండటం లేదు. ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. వీటి నుంచి బయట పడేందుకు ఎంతో మంది యోగాపై ఆసక్తి పెంచుకుంటున్నారు. యోగా ప్రపంచవ్యాప్తంగా మానవుల సమస్యల పరిష్కారంలో తిరుగులేని పాత్ర పోషిస్తోంది. యోగా సాధనతో మానసిక, శారీరక సమస్యలను పూర్తిగా అధిగమించవచ్చనే భావన ప్రతిఒక్కరిలో వ్యక్తం అవుతుంది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో యోగా శిక్షకులపై కథనం..

**యోగా రామచందర్‌గా పేరు**



ఇందూరు నగరానికి చెందిన రామచందర్ 1983 నుంచి యోగా శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో ఆయన యోగా రామచందర్‌గా పేరు పొందారు. రామచందర్ 1986లో జిల్లా యోగా అసోసియేషన్‌ను నెలకొల్పారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రామచందర్ ఇప్పటికీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఈ అసోసియేషన్‌కు కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం గమనార్హం. ఇక్కడ శిక్షణ పొంది సర్టిఫికెట్ తీసుకున్న వారిలో ఎంతోమంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 1987 నుంచి రామచందర్ అనేకమంది యోగా మాస్టర్లను తయారు చేస్తూ వస్తున్నారు. వేలాది మంది ఆయన వద్ద యోగా నేర్చుకుని మంచి స్థాయికి వెళ్లారు.

**అనేక లాభాలు**

యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది. యోగా తో పాటు ధ్యానం, ప్రాణాయామం చేస్తే అనేక సమస్యలను పరిష్కారం లభిస్తోందని నిపుణులు చెబుతున్నారు. యోగాతో మనోనిగ్రహం కలుగుతుంది. భుజంగాసనం, పద్మాసనం ప్రాక్టీస్ చేస్తే ఏకాగ్రత పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

### జాతీయస్థాయిలో ఖ్యాతి



రుద్రూర్: రుద్రూర్‌కు చెందిన డాక్టర్ విశ్వనాథ్ మహజన్ యోగా కార్యక్రమాలతో జాతీయ స్థాయిలో పేరు సంపాదించుకున్నాడు. ఆయన ఎనిమిదేళ్ల క్రితం రుద్రూర్‌లో యోగా కేంద్రాన్ని స్థాపించారు. పతంజలి యోగా విశ్వవిద్యాలయం నిర్వహించే మట్టి స్నానం, యజ్ఞసహిత యోగా వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి దీర్ఘకాలిక రోగాల నుండి ఎలా ఉపశమనం పొందవచ్చో నిరూపించారు. జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. పతంజలి యోగా వ్యవస్థాపకుడు రాందేవ్ బాబా విశ్వనాథ్ మహజన్ సేవలకు ప్రశంసించి హరిద్వార్‌కు ఆహ్వానించారు. విశ్వనాథ్‌తో పాటు ఆయన కుమారుడు, కూతురు ఒకే వేదికపై 108 సూర్య నమస్కారాలు చేసి నోబెల్ వరల్డ్ రికార్డు సాధించారు. ఆయుష్ సంస్థ నుంచి దక్షిణ భారత దేశంలోనే యోగా మాస్టర్ సర్టిఫికెట్ పొందిన తొలి వ్యక్తిగా ఘనత సాధించాడు. రుద్రూర్‌లో రిటైర్డ్ టీచర్ కెవి మోహన్‌తో కల్సి యోగా భవన నిర్మాణానికి కృషి చేశారు.

## బదిలీలకు వేళాయే..!

- ఎన్నికల కోడ్ ముగియడంతో ట్రాన్స్‌ఫర్లపై చర్చ
- ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలకు త్వరలో స్థానచలనం..




సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో బదిలీలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయంలో జోన్, మల్టీజోన్–1 నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన డివిజన్, మండలస్థాయి అధికారుల ట్రాన్స్‌ఫర్లకు చర్యలు చేపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా భారీగా కలెక్టర్లు, ఎస్పీ, సీపీల బదిలీల ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలో డివిజన్, మండలస్థాయి అధికారులను త్వరలోనే బదిలీ చేయనుంది. ప్రస్తుతం ధరణి సమస్యలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే బదిలీ ఉత్తర్వులు వచ్చే అవకాశముందని చర్చ జరుగుతోంది.

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో భారీగా బదిలీలు చేపట్టారు. ముఖ్యంగా రెవెన్యూశాఖలో అదనపు కలెక్టర్ సహా ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీరాజ్‌శాఖలో డీపీవో సహా డీఎల్‌పీవోలు, ఎంపీడీవోలు, పోలీస్‌శాఖలో ఏసీపీ, సీఐ, ఎస్‌ఐలు బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన అధికారులంతా ఎన్నికల కోడ్ ముగిసినప్పటినుంచి బదిలీ ఉత్తర్వుల కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాకు వచ్చారు. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్ బదిలీ ఉత్తర్వుల్లో వారి పేర్లు లేవు. దీంతో ఇప్పట్లో వారి బదిలీలు లేనట్టేనని స్పష్టత వచ్చింది.

**ఈ నెలాఖరులో ఉత్తర్వులు..!**

ధరణిలో నెలకొన్న సమస్యలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతోంది. ఈప్రక్రియ మరో వారం రోజుల్లో ముగియనుంది. ఆ తర్వాతే ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు సంబంధించిన బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశముందని రెవెన్యూవర్గాల్లో చర్చ జరుగుతోంది. కాగా ఎన్నికల నేపథ్యంలో ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు ధరణి విన్నపాలను వివిధ కారణాలు సాకుగా చూపి తిరస్కరించి చేతులు దులుపుకుంటున్నట్లు సమాచారం.

**ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో..**

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు తమకు అనుకూల మండలాల కోసం ప్రజాప్రతినిధులను కలిసి ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ పదేళ్ల తర్వాత అధికారంలోకి రావడంతో తమకు అనుకూలమైన అధికారులను తమ పరిధిలోని మండలాలకు బదిలీ చేయించుకోవాలని ఎమ్మెల్యేలు ఇప్పటి నుంచే ఉన్నతాధికారులకు సిఫార్సులు చేస్తున్నట్లు తెలిసింది. పరిపాలనలో కీలకమైన రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో అనుకూల అధికారులు ఉండాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు.

## క్లుప్తంగా

### జూలై 2 నుంచి డిగ్రీ వన్‌టైం పరీక్షలు

**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ) కోర్సులు 2016, 2017, 2018 సంవత్సరాల్లో పూర్తి చేసి ఉత్తీర్ణత సాధించలేని 1, 2, 3, 4, 5, 6వ సెమిస్టర్‌ విద్యార్థులకు వన్‌ టైం బ్యాక్‌లాగ్‌ పరీక్షలు జూలై 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్‌ ప్రొఫెసర్‌ ఎం.అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల టైం టేబుల్‌ వివరాలను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌www.telangana university.ac.inలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

### నేడు జిల్లా కోర్టులో యోగాడే

**ఖలీల్‌వాడి:** నేడు జిల్లా కోర్టులో యోగా డే నిర్వహించనున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలోని మొదటి అంతస్తులో యోగా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. యోగా ద్వారా ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.

### కమ్మర్‌పల్లి వాసికి డాక్టరేట్‌


గడ్డం శ్రీనివాస్‌రెడ్డి

**కమ్మర్‌పల్లి:** మండల కేంద్రానికి చెందిన గడ్డం శ్రీనివాస్‌రెడ్డికి లిమ్నోలాజికల్‌లో కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ ప్రదానం చేసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్‌ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్రం విభాగ అధిపతి, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తన గైడ్‌ ప్రొఫెసర్‌ టి రవీందర్‌ పర్యవేక్షణలో సరస్సులు, నదులు, ప్రవాహాలు, నీటి వనరులు, లోతట్టు మంచినీటి వ్యవస్థలపై అధ్యయనంలో భాగంగా 'లిమ్నోలాజికల్‌ స్టడీస్‌ ఆఫ్‌ నిజాంసాగర్‌ రిజర్వాయర్‌' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. పాఠశాల విద్య కమ్మర్‌పల్లిలోనే పూర్తి చేసిన శ్రీనివాస్‌రెడ్డి నిజాంసాగర్‌లో స్కూల్‌ అసిస్టెంట్‌గా ఆరు సంవత్సరాలు పని చేసిన తర్వాత జూనియర్‌ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. నిజామాబాద్‌ ఖిల్లా జూనియర్‌ కాలేజీ (ఐలాపూర్‌)లో 15 సంవత్సరాలు పని చేసిన అనంతరం డిగ్రీ కాలేజ్‌ లెక్చరర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం గిరిరాజ్‌ కళాశాలలో జంతుశాస్త్రం విభాగ అధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్‌ పురస్కారం లభించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### భవిత కేంద్రం తనిఖీ



**వేల్పూర్‌:** మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్‌ శ్రీనివాస్‌ గురువారం తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవల గురించి ఐఈ ఆర్‌పీలు శైలజ, మౌళికను అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయాలన్నారు.

### మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



**డొంకేశ్వర్‌(ఆర్మూర్‌):** కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు మద్దతు ధరను ప్రకటించడాన్ని హర్షిస్తూ డొంకేశ్వర్‌ మండలం మారంపల్లిలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి గురువారం పాలాభిషేకం చేశారు. బీజేపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉందని, పంటలకు మద్దతు ధర కల్పించడం గొప్ప విషయమన్నారు. అనంతరం మారంపల్లి– డొంకేశ్వర్‌ బైపాస్‌ మట్టి రోడ్డును పరిశీలించారు. ఆయనవెంట బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్‌, నాయకులు ఆరే గంగాధర్‌, శ్రీనివాస్‌, రవి, నర్సారెడ్డి, సంతోష్‌ తదితరులున్నారు.

# అస్తవ్యస్తంగా విద్యుత్‌ శాఖ వ్యవస్థ

- దర్జాగా ఏఈ సంతకం ఫోర్జరీ చేసిన ఉద్యోగులు
- సెక్షన్ల పరిధిలో పర్యవేక్షణను గాలికొదిలేసిన ఉన్నతాధికారులు


విద్యుత్‌శాఖ ప్రగతిభవన్‌

**నిజామాబాద్‌నాగారం:** విద్యుత్‌ శాఖలో అధికారుల పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా విద్యుత్‌శాఖలోని టౌన్‌–3 ఏడీఈ సెక్షన్‌ పరిధిలో నాగారం సెక్షన్‌ ఏఈ సంతకం ఫోర్జరీ జరిగింది. ఆ ఉద్యోగి ఈ నెల 25 నుంచి జూన్‌ 10 వరకు సెలవులో ఉన్నారు. పై స్థాయి అధికారులు నాగారం సెక్షన్‌కు సంబంధించి ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేదు. సమస్యల నిమిత్తం ఏఈకి ఫోన్‌చేస్తే ఫోన్‌ డైవర్ట్‌లో ఫోర్‌మెన్‌ వచ్చేవారు. ఏఈ లేకపోవడంతో ఈ సెక్షన్‌లో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. నిబంధనల ప్రకారం కొత్త మీటర్‌ మంజూరు చేయాలంటే అన్ని రకాల పత్రాలు పరిశీలించిన తర్వాతే ఇస్తారు. ఈ సెక్షన్‌లో మాత్రం ఒక్కో కొత్త మీటర్‌కు రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పైగా వసూలు చేయడం పరిపాటిగా మారింది. సింగల్‌ ఫేజ్‌ మీటర్‌లకు ఒకమాదిరిగా, త్రీఫేజ్‌ మీటర్‌కు మరొక విధంగా, పత్రాలు లేకుండానే వందల సంఖ్యలో మీటర్లు జారీ చేస్తున్నారు. కొత్త మీటర్‌ పెట్టాలన్నా, మీటర్‌లో సమస్యలు వచ్చినా, స్తంభాలు, లైన్‌లు మార్చడం వంటి పనులు చేయి తడిపితేనే అవుతాయి. లేకుంటే అంతే సంగతులు.

**పర్యవేక్షణ గాలికి..**

ఆయా సెక్షన్ల పరిధిలో ఏం జరుగుతుందో పర్యవేక్షణ చేయాల్సిన ఏఈలు, ఏడీఈ తమకేమీ తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు. జిల్లాలో నాలుగు డివిజన్లున్నాయి. డివిజన్‌స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా నామ మాత్రంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. అందుకే నగరంలోనే నాగారం సెక్షన్‌ పరిధిలో ఏఈ సంతకం ఫోర్జరీ వరకు వెళ్లింది. డివిజన్‌ స్థాయి అధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో కిందిస్థాయిలో ఏం జరుగుతుందో ఎలా తెలుస్తుందని వినియోగదారులు పేర్కొంటున్నారు.

**ఏఈ సెలవులో ఉన్నప్పుడే జరిగింది**

నాగారం సెక్షన్‌ ఏఈ సెలవులో ఉన్నప్పుడే ఈ ఘటన జరిగింది. ఏఈ సంతకం ఫోర్జరీపై ఉన్నతాధికారులకు వివరించాం. ఎవరి ప్రమేయం ఎంత ఉందో తెలుసుకుంటున్నాం. ఏఈ సెలవులో ఉన్నప్పుడు ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. కేవలం నోటిమాట చూసుకొమ్మని మరో ఏఈకి చెప్పాం. నేను కూడా ఈ నెల 5 నుంచి 10 వరకు సెలవులో ఉన్నాను.

– శ్రీనివాస్‌రావు, డీఈ, విద్యుత్‌ శాఖ

**విచారణ జరుగుతోంది**

నాగారం సెక్షన్‌లో ఏఈ సంతకం ఫోర్జరీపై సీఎండీ వరుణ్‌రెడ్డి చాలా సీరియస్‌గా ఉన్నారు. దీనిపై క్వాలిటీ కంట్రోల్‌ ఏడీఈతో విచారణకు ఆదేశాలు ఇచ్చాం. ఈ నెల 21న సాయంత్రం 5 గంటల వరకు నివేదిక రాగానే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎవరు తప్పు చేసినా శిక్ష పడుతుంది.

– రవీందర్‌, ఎస్‌ఈ, విద్యుత్‌ శాఖ

## 'ధరణి' దరఖాస్తులను మూడు రోజుల్లో పరిష్కరించాలి


తహసీల్‌ కార్యాలయంలో ధరణి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌):** ధరణి పెండింగ్‌ దరఖాస్తులను రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. గురువారం డిచ్‌పల్లి తహసీల్‌ కార్యాలయాన్ని కలెక్టర్‌ సందర్శించి ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్‌ ప్రభాకర్‌, ఆర్‌ఐలు సంతోష్‌, ప్రభురాజ్‌తోపాటు ఆపరేటర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అని తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్‌ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్‌, పెండింగ్‌ మ్యూటేషన్‌ వంటి దరఖాస్తులను అవసరమైన రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. డేటా కరెక్షన్‌ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన తర్వాత పరిష్కరించాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వాటి పరిష్కారంలో ఆలస్యానికి తావులేకుండా చూడాలన్నారు. నిర్ణీత గడువులోగా ధరణికి సంబంధించిన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు.

## కుమురం భీమ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


నడ్కుడ గాదేపల్లిలో కుమురం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

**డొంకేశ్వర్‌(ఆర్మూర్‌):** పోరాట యోధుడు కుమురం భీమ్‌ను ఆదివాసులు, గిరిజనులు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. డొంకేశ్వర్‌ మండలం నడ్కుడ గాదేపల్లి శివారులో ఏర్పాటు చేసిన కుమురం భీం విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. కొమురం భీమ్‌లాగా హక్కుల కోసం పోరాడాలని, అభివృద్ధిని సాధించుకోవాలని సూచించారు. గ్రామాల్లో కుల, మతాలకు అతీతంగా కలిసి కట్టుగా ఉండాలని, ధర్మాన్ని కాపాడుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని, ఆదివాసీల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా ఇళ్లు లేని పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని, అర్హులకు రేషన్‌ కార్డులు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్‌ సంఘం అధ్యక్షుడు శ్రీను, ఎంపీటీసీలు సుగుణ చిన్నారెడ్డి, సంజీవ్‌, బీజేపీ మండల అధ్యక్షులు సురేందర్‌, నాయకులు ఆరే గంగాధర్‌, కల్లెం సంతోష్‌రెడ్డి, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జైలులో టీబీ నిర్ధారణ పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో తుకారాం

**ఖలీల్‌వాడి:** జిల్లా కేంద్రం శివారులోని జిల్లా జైలులో టీబీ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి తుకారాం రాథోడ్‌ గురువారం తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే వెంటనే డాక్టర్‌కు తెలుపాలని ఖైదీలకు సూచించామన్నారు. జైలులో ఉన్న 411 మంది ఖైదీలకు టీబీ స్క్రీనింగ్‌, ఎయిడ్స్‌ పరీక్షలు నిర్వహించి టీబీ లక్షణాలు ఉన్న 19 ఖైదీల నుంచి తెమడ నమూనాలను సేకరించామని డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జైలు సూపరింటెండెంట్‌ ప్రమోద్‌, జైలర్‌ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా టీబీ కంట్రోల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ఏ సంతోష్‌, జైల్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ రాజ్‌కుమార్‌, జిల్లా టీబీ కో ఆర్డినేటర్‌ రవిగౌడ్‌, సుధాకర్‌, స్వాతి, మహేశ్‌, జైలు ఫార్మాసిస్ట్‌ శ్రీనివాస్‌, టీబీ సూపర్‌వైజర్‌ స్రవంతి, యాహియా తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## నేడు జిల్లా పరిషత్‌ సర్వసభ్య సమావేశం

- చివరి సమావేశానికి సభ్యులు హాజరయ్యేనా..
- జూలై 4న ముగియనున్న పదవీకాలం

**నిజామాబాద్‌ రూరల్‌:** జిల్లా కేంద్రంలోని జెడ్పీలో శుక్రవారం ఉదయం 10గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. వచ్చే నెల 4న సభ్యుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న చివరి సమావేశానికి సభ్యులు పూర్తిస్థాయిలో హాజరవుతారా? లేదా? అనేది చర్చనీయాంశమైంది. గత నెల 10 నిర్వహించాల్సిన సమావేశం కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. శుక్రవారం నిర్వహించనున్న సమావేశానికి సభ్యులు హాజరై తమ మండలాల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెడతారో లేదోనని పలువురు చర్చించుకుంటున్నారు. జెడ్పీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో సమావేశంలో చర్చకు వచ్చే అంశలు ఎక్కుగానే ఉండొచ్చంటున్నారు.

## పింఛన్‌ పెంచకపోతే ఉద్యమిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

**బోధన్‌:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల నెలవారీ పింఛన్‌ను రూ.6 వేలకు పెంచనిపక్షంలో ఉద్యమిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బస్వరాజ్‌ పాటిల్‌ అన్నారు. పట్టణంలోని ఉర్దూఘర్‌లో గురువారం నిర్వహించిన వికలాంగుల హక్కుల జాతీయవేదిక జిల్లాస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులుండగా, కేవలం 5 లక్షల 75 వేల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్‌ పోస్టులను ప్రకటించి ప్రత్యేక నోటిఫికేషన్‌ ద్వారా భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. శారీరక దివ్యాంగుల రోస్టర్‌ 10 లోపు తగ్గిస్తూ స్టేట్‌ సబార్డినేట్‌ సర్వీసు రూల్స్‌ను సవరించాలన్నారు. నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని అన్నారు. ఆసరా పింఛన్‌ను ప్రతినెల పంపిణీ చేయకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

**జూలై 31న బోధన్‌లో మూడో జిల్లా మహాసభ**

జూలై 31న వేదిక జిల్లా మూడో మహాసభ బోధన్‌ పట్టణ కేంద్రంలోని నిర్వహించనున్నామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షురాలు కవిత, రాష్ట్ర కమిటీ సభ్యుడు గైని రాములు తెలిపారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహాసభలో భవిష్యత్‌ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. 500 మంది ప్రతినిధులు సభకు హాజరవుతారన్నారు. నాయకులు యేశాల గంగాధర్‌, షేక్‌ నజీర్‌, రాములు, హమీనాబీ, రాజు, గంగారాం, హరిప్రియ, లక్ష్మి, సోని తదితరులు పాల్గొన్నారు.

### బాలికల కళాశాల ఆకస్మిక తనిఖీ



**నిజామాబాద్‌అర్బన్‌:** నగరంలోని బాలికల జూనియర్‌ కళాశాలను జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణ, అధ్యాపకుల పనితీరును సమీక్షించి ప్రిన్సిపల్‌తోపాటు సిబ్బందిని అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో జిల్లాలో ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బైపీసీ విద్యార్థిని అయేషా ఫాతిమా 971 మార్కులు సాధించడం అభినందనీయమన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి వచ్చిన ప్రతి విద్యార్థినికి అడ్మిషన్‌ ఇవ్వడానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రిన్సిపల్‌ నుస్రత్‌ జాహాన్‌ అన్నారు.

## ట్రాక్టర్‌ పైనుంచి పడి మున్సిపల్‌ కార్మికురాలు మృతి


కార్పొరేషన్‌ కమిషనర్‌ మంద మకరందుతో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

**నిజామాబాద్‌ నాగారం:** నిజామాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే ట్రాక్టర్‌ పైనుంచి పడి కార్మికురాలు మృతి చెందింది.వివరాలు ఇలా ఉన్నాయి.. రోజులాగే గురువారం చెత్త సేకరణ విధులకు హాజరైన కార్మికురాలు లలిత(50) ట్రాక్టర్‌పై డ్రైవర్‌ పక్కన కూర్చుంది. ట్రాక్టర్‌ రన్నింగ్‌లో ఉన్న క్రమంలో ప్రమాదవశాత్తు ఆమె కిందపడి మృతి చెందింది. అయితే ట్రాక్టర్‌ డ్రైవర్‌ నిర్లక్ష్యం కారణంగానే కార్మికురాలు లలిత మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి**

నగర మున్సిపల్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్‌ కార్మికురాలు లలిత గురువారం విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించింది. దీంతో బాధిత కుటుంబాన్ని ఆదుకొని, న్యాయం చేయాలని తెలంగాణ స్టేట్‌ మున్సిపల్‌ స్టాఫ్‌ అండ్‌ ఔట్‌సోర్సింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఏఐటీయూసీ కార్యనిర్వాక అధ్యక్షులు సుధాకర్‌, ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, సందీప్‌ కోరారు. ఈమేరకు వారు లలిత కుటుంబీకులతో కలిసి మున్సిపల్‌ కమిషనర్‌ మంద మకరందును కలిసి మాట్లాడారు.

## భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

**ఖలీల్‌వాడి:** భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పవన్‌నగర్‌కు చెందిన ఎర్రోళ్ల శ్యామ్‌(42) భార్య గౌరి ఈనెల 2వ తేదీన అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలు లేకపోవడంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న శ్యామ్‌ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క కేసరి విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నటు ఎస్సై తెలిపారు.

**కడుపునొప్పి భరించలేక..**

**ఖలీల్‌వాడి:** కడుపునొప్పి భరించలేక నగరంలోని మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జిల్లాపరిషత్‌ రోడ్డులో ఉన్న మున్సిపల్‌ క్వార్టర్స్‌లో గొండల రాహుల్‌(28) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నెల రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్న రాహుల్‌ బుధవారం ఆస్పత్రిలో చూయించుకోగా అపెండిసైటిస్‌ ఉన్నట్లు వైద్యులు చెప్పారు. మహబూబ్‌నగర్‌లో మున్సిపల్‌ మేనేజర్‌గా పని చేస్తున్న తన తండ్రి వెంకటేశ్వర్లుకు రాహుల్‌ విషయం తెలుపగా, ఆయన బుధవారం రాత్రి నిజామాబాద్‌కు బయల్దేరాడు. ఇంటికి చేరుకున్న వెంకటేశ్వర్లు తలుపుతట్టగా రాహుల్‌ తీయలేదు. అనుమానంతో వెంకటేశ్వర్లు కిటికీలో నుంచి చూడగా రాహుల్‌ఉరేసుకొని కనిపించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మద్యానికి బానిసై ఒకరు..**

**నవీపేట:** మండలంలోని ఆశాజ్యోతి గ్రామానికి చెందిన ఐటోళ్ల రాజు(37) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ గురువారం తెలిపారు. జులాయిగా తిరిగే రాజు గత కొంతకాలంగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### కుటుంబ కలహాలతో..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**ఎడపల్లి(బోధన్‌):** కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై బోధన్‌ పట్టణం రాకాసీపేటకు చెందిన బోగేవార్‌ రమేశ్‌(35) జానకంపేట శివారులోని అశోక్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. లేబర్‌గా పనిచేసే రమేశ్‌ అశోక్‌సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకోగా, గురువారం నీటిలో మృతదేహం తేలింది. గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వంశీకృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## క్రైం కార్నర్‌

## రోడ్డు ప్రమాదంలో విద్యుత్‌ ఏఈ మృతి


రవీందర్‌ (ఫైల్‌)

**బోధన్‌టౌన్‌(బోధన్‌):** బోధన్‌ – నిజామాబాద్‌ ప్రధాన రహదారిపై ఆటోనగర్‌ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్‌ శాఖ రూరల్‌ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న రవిచంద్ర(47) మృతి చెందాడు. సీఐ వీరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని బీఆర్‌ కాలనీలో నివాసం ఉంటున్న రవిచంద్ర విద్యుత్‌ శాఖలో రూరల్‌ ఏఈగా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో భాగంగా నిజామాబాద్‌లోని విద్యుత్‌ కార్యాలయంలోని స్టోర్‌ రూమ్‌కి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా ఆటోనగర్‌ వద్ద డివైడర్‌కు ఢీ కొట్టుకుని తీవ్రగాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం బోధన్‌ జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించినప్పటికీ రవిచంద్ర అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య పద్మజ విద్యుత్‌ శాఖలోనే జేఈఏవోగా విధులు నిర్వర్తిస్తుండగా, మృతుడికి కొడుకు వెంకటప్రసాద్‌, కూతురు శ్రీజ ఉన్నారు. పద్మజ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**బైక్‌ ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు..**

**మాచారెడ్డి:** మండలంలోని భవానీపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాల్వంచ మండలం భవానీపేటకు దోమకొండ బాల్‌రాజ్‌ (74) బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో గ్రామంలోని కల్లు డిపోనకు నడుచుకుంటూ వెళ్తుండగా కామారెడ్డి–సిరిసిల్లా రహదారిపై వెనుక నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన బాల్‌రాజ్‌ను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్‌

**ఎల్లారెడ్డి:** నెలరోజుల క్రితం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించిన నిందితుడిని గురువారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. ఆలయంలోని సీసీ ఫుటేజీ ద్వారా నిందితుడిని లింగంపేట మండలం ఎక్కపల్లి తండాకు చెందిన మాలోత్‌ గణేశ్‌గా గుర్తించామన్నారు. ఆలయ ప్రవేశ ద్వారం తాళం పగులగొట్టిన నిందితుడు లోనికి ప్రవేశించినప్పటికీ నగదు, ఇతర వస్తువులు లభ్యం కాలేదన్నారు. అలాగే లింగంపేట, నాగిరెడ్డిపేట, తాడ్వాయి, దేవునిపల్లి పోలీస్‌ స్టేషన్ల పరిధిలో నిందితుడు గణేశ్‌ చోరీలకు పాల్పడినట్లు తెలిపారు.

### స్టాక్‌యార్డ్‌ నుంచి 'థార్‌' వాహనం చోరీ

**డిచ్‌పల్లి:** మండలంలోని బర్దిపూర్‌ శివారులో ఉన్న మహీంద్రా షోరూం ఆవరణ నుంచి దుండగులు 'థార్‌' వాహనాన్ని ఎత్తుకెళ్లారు. షోరూం మేనేజర్‌ సాయినాథ్‌, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. షోరూం వెనుక ప్రాంతంలోని స్టాక్‌ యార్డ్‌లో కొత్త వాహనాలు ఉంచుతారు. రెండు రోజుల క్రితం స్టాక్‌ యార్డ్‌ తాళం చెవి కనిపించకుండాపోయింది. బుధవారం రాత్రి సుమారు 8.15 గంటలకు దుండగులు స్టాక్‌ యార్డ్‌ వెనుక వైపు ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి కొత్త థార్‌ (బ్లాక్‌ కలర్‌) వాహనాన్ని ఎత్తుకెళ్లారు. తిరుమల ఇన్‌స్టిట్యూట్‌ ప్రహరీ పక్కనుంచి కియా షోరూం మీదుగా ప్రధాన రోడ్డుపైకి చేరుకుని వాహనంతో పాటు పారిపోయారు. గురువారం ఉదయాన్నే తాళం చెవి దొరకడంతో స్టాక్‌ యార్డ్‌ తెరిచిన షోరూం సిబ్బంది థార్‌ వాహనం చోరీకి గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తమ సిబ్బందితో షోరూం చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

### ఐదుగురిపై కేసు

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ఐదుగురిపై కేసునమోదు చేసినట్లు ఏఎస్సై సంజీవులు గురువారం తెలిపారు. ఇంటి స్థలం విషయంలో గ్రామానికి చెందిన తిరుపతి, సంగయ్యపై అదే గ్రామానికి చెందిన నర్సారెడ్డి, కపిల్‌, ఆనంద్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, . ధర్మారెడ్డి కలిసి దాడిచేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### తండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల జైలు

**వర్ని:** మద్యం మత్తులో తండ్రిని చంపిన కొడుకుకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ బోధన్‌ సెషన్స్‌ కోర్టు జడ్జి రవికుమార్‌ గురువారం తీర్పు వెలువరించారు. వర్ని పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కోకల్‌దాస్‌ తండాకు చెందిన వినోద్‌ 2021లో మద్యంమత్తులో తన తండ్రి ధూప్యాను హత్య చేశాడు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో నిందితుడికి శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. ఈ కేసులో పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌ శ్యామ్‌రావు వాదనలు వినిపించారు.

**ట్రాక్టర్‌ డ్రైవర్‌కు మూడు నెలల శిక్ష..**

**ఎడపల్లి:** అజాగ్రత్త ట్రాక్టర్‌ నడిపిన డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ బోధన్‌ అడిషనల్‌ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి సాయి శివ తీర్పు ఇచ్చారని ఎస్సై వంశీచందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 2017లో మండలంలోని వడ్డేపల్లికి చెందిన భరత్‌, ఈశ్వర్‌ సైకిల్‌పై కిరాణాసామాను కోసం ఎడపల్లికి వెళ్తుండగా మట్టి లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌ ఢీకొట్టింది. భరత్‌ కాళ్లపైనుంచి ట్రాక్టర్‌ వెళ్లడంతో కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. అలాగే ఈశ్వర్‌ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుల కుటుంబసభ్యులు ఫిర్యాదు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టగా, ట్రాక్టర్‌ డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్షతోపాటు పరిహారం కింద ఒకరికి రూ.5 వేలు, మరొకరికి రూ. 10 వేలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

### వృద్ధుడి అదృశ్యం

**ఖలీల్‌వాడి:** నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన జగదీశ్‌(53) అదృశ్యమైనట్లు మూడోటౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ గురువారం తెలిపారు. ఈనెల 9న దుకాణానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన జగదీశ్‌ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. జగదీశ్‌ ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు దేవేందర్‌ ఫిర్యాదు చేశాడని ఎస్సై తెలిపారు.

**కామారెడ్డికి చెందిన వివాహిత..**

**కామారెడ్డి టౌన్‌:** పట్టణంలోని గొల్లవాడకు చెందిన పాన్నాల లక్ష్మి తన ముగ్గురు పిల్లలతో కలిసి కొత్తబస్టాండ్‌ నుంచి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. భర్తకు చెప్పకుండా ముగ్గురు పిల్లలతో కలిసి గురువారం ఉదయం 10 గంటలకు కొత్తబస్టాండ్‌కు వచ్చిన లక్ష్మి ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. ఆమె భర్త స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### ఇద్దరి రిమాండ్‌

**లింగంపేట(ఎల్లారెడ్డి):** మండలంలోని బోనాల్‌కు చెందిన నీల స్వామిని గొంతుకోసి హత్యచేసేందుకు యత్నించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గత సోమవారం నీల స్వామిపై అతని బంధువులైన నవీన్‌, సుధాకర్‌ మెంగారం గ్రామం వద్ద కత్తితో దాడి చేసి గొంతుకోసి పరారయ్యారు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని సుధాకర్‌, తమ కుటుంబంతో గొడవపడ్డాడని నవీన్‌.. స్వామిపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నించారని ఎస్సై తెలిపారు.

### కరెంటు షాక్‌తో గేదె మృతి

**తాడ్వాయి(ఎల్లారెడ్డి):** పల్లెగడ్డలో నునావత్‌ విఠల్‌కు చెందిన పాడి గేదె గురువారం కరెంటు షాక్‌తో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె గ్రామ శివారులో మేత మేస్తుండగా అక్కడనే ఉన్న కరెంటు వైర్లకు తగలడంతో షాక్‌ వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.90 వేల వరకు ఉంటుందని, విద్యుత్‌ అధికారులు తనకు నష్టపరిహారం ఇప్పించాలని బాధితుడు విఠల్‌ కోరారు.